క్లుప్తంగా

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు



పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని సంజీవాపూర్ గేట్ వద్ద అదుపుతప్పి కారు బోల్తాపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గంట్రావ్‌పల్లి మాజీ సర్పంచ్ చిన్నయ్య కారులో నాగర్‌కర్నూల్‌కు వెళ్తుండగా సంజీవాపూర్ గేటు వద్ద కారు అదుపు తప్పి గోతిలో పడింది. కారులో బెలూన్లు ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది. ప్రమాదంలో చిన్నయ్య, డ్రైవర్ మల్లేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



వెల్దండ: మండలంలోని కంటోనిపల్లిలో ఆదివారం మాజీ సర్పంచ్ పెద్ది రామకృష్ణ భూమిపూజ చేసి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామంలో రూ.10లక్షల నిధులతో సీసీరోడ్లు, రూ.15లక్షలతో అండర్ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సీసీరోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్ సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సురేందర్, పీఆర్ ఏఈ సురేందర్‌రెడ్డి, కార్యదర్శి ఫయాజ్, నాయకులు బాలస్వామిగౌడ్, కృష్ణయ్యగౌడ్, మహేష్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని బలరాంనగర్ కాలనీకి చెందిన నాగమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బావన్ల మధు రూ.5వేలు, మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ రూ.3వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు సాయన్న మాదిగ, రామస్వామి, రామకృష్ణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నేడు విత్తనాల పంపిణీ

ఉప్పునుంతల: తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక రైతువేదిక వద్ద ప్రతి క్లస్టర్ నుంచి ముగ్గురు రైతులకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చేతుల మీదుగా మేలు రకం వరి, జొన్న విత్తనాల కిట్లను పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సీపీఐ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా గోపాల్



అచ్చంపేట రూరల్: సీపీఐ అచ్చంపేట డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పెరుముల గోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అచ్చంపేటలో నిర్వహించిన సీపీఐ 18వ మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌నర్సింహ ప్రకటించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడు తూ.. డివిజన్‌లో సీపీఐని బలోపేతం చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా, రాష్ట్ర కమిటీ బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పూర్తి స్థాయి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. గోపాల్ ఎన్నికపై పలువురు హర్షం ప్రకటించారు.

ఆపరేషన్ 'కగార్' నిలిపివేయాలి

ఆత్మకూర్: ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అణిచి వేస్తుందని, విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతున్నారని వామపక్షాల పార్టీల నాయకులు ఆరోపించారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ప్రసాద్, రాజు, మోషే, రాబర్ట్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని, బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

తెలకపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలను, ఇతర పాఠశాలల్లో చదుతున్న విద్యార్థులను గుర్తించి తలిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఉత్తమ విద్యతోపాటు ఉచిత భోజనం, ఉచిత పుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న నలుగు రు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలో చేర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు చాంద్‌పాషా, మల్లేష్, పాల్గొన్నారు.



పెద్దపల్లిలో బడిబాటలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

కల్వకుర్తి రూరల్: రోజురోజుకూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని, సర్కార్ బడులను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరి ఉందని మార్కెట్ మాజీ డైరెక్టర్ గుండోజు గంగాధర్ అన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సరైన వసతులు, ఉపాధ్యాయులు లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఆర్థిక భారం అయినప్పటికీ ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికార పార్టీ ఏజెంట్లుగా పోలీసులు

బిజినేపల్లి: ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేసే బీఎస్పీ జిల్లా నాయకుడు పృథ్వీరాజ్‌పై పోలీసులు అక్రమ కేసులు పెట్టి అధికార పార్టీ ఏజెంట్లుగా పని చేస్తున్నారని బీఎస్పీ మండల అధ్యక్షుడు పానుగంటి రాంచందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులతో పాటు, విలేకర్లపై అక్రమ కేసులు పెట్టి ప్రశ్నించే గొంతుల్ని నొక్కుతున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తే కేసులు పెడతాం అన్నట్లుగా పోలీసుల తీరు ఉందని దుయ్యబట్టారు. అధికారం చేతుల్లో ఉందని, కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా అక్రమ కేసుల పరంపరను మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వట్టెపు శివకృష్ణ, బోనాసి భాస్కర్, కావలి మల్లేష్, శ్రీను, రాము, బాలరాజు, బీవీఎఫ్ వెంకటేష్, లేట్ల శ్రీహరి, రమేష్ పాల్గొన్నారు.

ఎస్‌ఐను సస్పెండ్ చేయాలి

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తిలో జరిగిన ఓ ఘటనలో బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ పృథ్వీరాజ్‌పై తప్పుడు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ గోవర్ధన్‌ను సస్పెండ్ చేయాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో బీఎస్పీ నాయకులు సమావేశమయ్యారు. అనంతరం పార్టీ జిల్లా ఈసీ మెంబర్ బి.దాసు, నియోజకవర్గ అధ్యక్షుడు బొల్లి కురుమయ్య విలేకర్లతో మాట్లాడారు. బీఎస్పీ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయడం సమంజసం కాదన్నారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా తమ పార్టీ నాయకులపై జిల్లా పోలీసు యంత్రాంగం అక్రమ కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. ప్రజల పక్షాన బీఎస్పీ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగశేషి, లక్ష్మణ్, రామకృష్ణ, కోళ్ల మధు, కాన్షీరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి వార్షికోత్సవం



కేదారేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు



ఉప్పునుంతల బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

ఉప్పునుంతల: మండల కేంద్రంతో పాటు శివారు గ్రామాలైన కొత్తరాంనగర్, గట్టుకాడిపల్లి గ్రామాల్లో బొడ్రాయిళ్ల ప్రతిష్ఠించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం బొడ్రాయి తృతీయ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్థానిక కేదారేశ్వర ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అన్ని దేవతా విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయం ఆవరణలో సామూహిక హోమం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు ఊరేగింపుగా రాగి బిందెలతో తెచ్చిన నీళ్లతో బొడ్రాయిని అభిషేకించారు. అనంతరం గ్రామదేవత పోచమ్మ అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం కేదారేశ్వర ఆలయం ఆవరణలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం మహిళలు అలంకరించిన బోనాలను తలపై పెట్టుకొని కోట మైసమ్మ, బొడ్రాయి, పోచమ్మ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

కల్వకుర్తి రూరల్: చదువులో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఆవోపా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లగిశెట్టి కోదండరాములు అన్నారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో ఇంటర్మీడియట్, పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 25 మందికి ఆదివారం బహుమతులు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ పాండు, ఆర్థిక కార్యదర్శి శంకర్, పాపిశెట్టి సతీష్, యాద శోభన్‌బాబు, బిళ్లకంటి వెంకటేశ్వర్లు, నరసింహయ్య, కుమారస్వామి, విజయ్‌కుమార్, నరసింహులు గుప్తా, డాక్టర్ శ్రీను, పోల మురళీధర్, దాచేపల్లి తిరుపతయ్య, గుండ్ల శ్రీనివాస్, సురేష్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న ఆవోపా సభ్యులు

నిరుపయోగంగా రైతు వేదికలు



తాడూరులో రైతు వేదిక ఆవరణలో పెరిగిన ముళ్లపొదలు

తాడూరు: రైతులను చైతన్యవంతులను చేసేందుకు రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన రైతు వేదికలు నిరుపయోగంగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు గాను 7 క్లస్టర్లను ఎంపిక చేసి ఆయా క్లస్టర్లలో రూ.లక్షలు వెచ్చించి రైతు వేదిక నిర్మాణాలు చేపట్టారు. రైతులకు అందుబాటులో కాకుండా గ్రామానికి దూరంగా నిర్మించడం వల్ల ఉపయోగపడకుండా ఉన్నాయి. సిర్సవాడ ఇంద్రకల్, బలాన్‌పల్లి, అల్లాపూర్ గ్రామాలు మినహాయిస్తే మిగిలిన గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు వేదికలు గ్రామాలకు దూరంగా ఉండటం వలన ఇటు సిబ్బంది, అటు రైతులు ఆసక్తి కనబర్చడం లేదు. దీంతో రైతు వేదికలు విషపురుగులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, సమావేశాలు ఉన్నప్పుడు మాత్రమే రైతు వేదికలు ఉపయోగించుకోవడం వలన రైతు వేదికల ఆవరణలో ముళ్లపొదలు, చెట్లు మొలిచి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారలుఉ స్పందించి రైతువేదికల నిర్వహణపై చర్యలు చేపట్టాలని ఆయా క్లస్టర్ల రైతులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వెల్దండ: మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 22మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వెల్దండ, ఆమనగల్లు, కల్వకుర్తి మండలాలకు చెందిన 22మంది లబ్ధిదారులకు రూ.6.66 లక్షల విలువ గల చెక్కులను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంతునాయక్, నరేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు వెంకటేనాయక్, శ్రీనునాయక్, కొండల్‌యాదవ్, లక్ష్మణ్, తరుణ్‌స్వామి, కృష్ణయాదవ్ తదితరులు ఉన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

పంటలకు మద్దతు ధర పెంపుపై హర్షం

చారకొండ: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ చారకొండ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ చిత్రాపటాన్ని ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు చెలమోని కృష్ణ మట్లాడుతూ.. కేంద్రం ప్రతి సంవత్సరం పంటలకు మద్దతు ధర పెంచుతుండడంతో రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. బీజేపీతోనే రైతుల సంక్షేమం సాధ్యమన్నారు. పత్తికి క్వింటాల్‌కు దాదాపుగా రూ.600 పెంచడంతో తెలంగాణలో అత్యధికంగా పత్తి పండించే రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వేణు శర్మ, హరిబాబు, చంద్రారెడ్డి, రాములు, నరేష్, శ్రీకాంత్, శరత్ ఉన్నారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఎంపీ మల్లు రవికి సన్మానం



కల్వకుర్తి రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లు రవి పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీని ఉమ్మడి మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ కార్యదర్శి పసుల రాజేష్‌రెడ్డి మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించాలి

కల్వకుర్తి రూరల్: చిన్నప్పటి నుంచే విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయాలను అలవర్చాల్సిన అవసరం ఉందని వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కల్వ మనోహర్, బీజేపీ నియోజకవర్గ నాయకుడు రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో 40 రోజుల పాటు నిర్వహించిన భగవద్గీత పారాయణం కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సనాతన ధర్మం ఎంతో గొప్పగా కీర్తించబడుతుంటే భారతదేశంలో యువత విదేశీ వ్యామోహంలో మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గీతా పారాయణం నేర్చుకున్న విద్యార్థులకు రాంభూపాల్‌రెడ్డి బహుమతులను అందజేశారు. విద్యార్థులకు గీతా పారాయణం నేర్పిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య, వరలక్ష్మి, తిరుపతయ్య, శ్రీను, రవిచంద్ర, కొండూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత మాటలు అవివేకం

మన్ననూర్: న్యాయస్థానం తరుపున కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే తెలంగాణ ప్రజలకు ఇచ్చినట్లు అవుతుందని ఎమ్మెల్సీ కవిత మాట్లాడటం ఆమె అవివేకానికి నిదర్శనమని ఉమామహేశ్వర పాలక మండలి సభ్యురాలు సంబు శోభ వెంకటరమణ ఎద్దేవా చేశారు. ఆదివారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని నిలువు దోపిడి చేసిన కేసీఆర్ కుటుంబం అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. నాలుగు రోజుల పాటు దొంగ దీక్ష చేసిన కేసీఆర్ తెలంగాణ ప్రదాత అయితే ప్రత్యేక తెలంగాణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన 1200 మంది అమరులు ఎవరని ఆమె ప్రశ్నించారు. తప్పు చేసిన వారు ఎవరైనా శిక్షకు అర్హులేనని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు, నిరుద్యోగులపై వివక్షత చూపి, వారి కుటుంబానికే ఉద్యోగ అవకాశాలు కల్పించుకున్న ఘనుడు కేసీఆర్ అని మండిపడ్డారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

చారకొండ: భూ సమస్యల పరిష్కారానికి జూన్ 3 నుంచి 12వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో సదస్సులు నిర్వహించడానికి రెండు బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జూన్ 3న కమాల్‌పూర్, శేరిఅప్పారెడ్డిపల్లి, 4న చారకొండ, జూపల్లి, 5న తిమ్మాయిపల్లి, గోకారం, 6న సిర్సనగండ్ల గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అచ్చంపేట రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులు ఈ నెల 3నుంచి 17 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నామని తహసీల్దార్ సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు మూడు టీంలుగా ఏర్పడి ఆయా గ్రామాల్లోని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లు రద్దు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం ఏక పక్షంగా తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని భవన నిర్మాణ సంస్థ రాష్ట్ర కార్యదర్శి రత్నాకరం డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రూబీ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం మూడు దఫాల కాలంలో కార్మిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి సంపద సృష్టికర్తలు పెట్టుబడి దారులని చెప్పడం కార్మిక వర్గాన్ని అవహేళన చేయడమేనని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాల రాసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం దుర్మార్గమన్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, శ్రీను, బంగారయ్య, రాములు, సత్యం, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్యదర్శి రత్నాకరం

'అభివృద్ధికి సహకరించండి'

చారకొండ: మండలంలోని గోకారం, చంద్రాయన్‌పల్లిలో బీటీ రోడ్డు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ఇతర అభివృద్ధికి పనులకు నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ అధికారులతో మాట్లాడి త్వరగా పనులు ప్రాంభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. గోకారంలో గతంలో జలాశయం నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యేను కోరడంతో.. ఆయన సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం రూ. 5.50లక్షల నుంచి రూ.7.70 లక్షలు చెల్లించినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాంబయ్యగౌడ్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ శ్రీను, నాయకులు చరణ్, రామస్వామి, శంకర్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేతో మట్లాడుతున్న నాయకులు

విద్యార్థులు అన్నింటా రాణించాలి

బిజినేపల్లి: ఆధునిక కాలానికి కనుగుణంగా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని పాలెం టీఎస్‌ఎం హైస్కూల్ పూర్వ విద్యార్థులు అన్నారు. ఆదివారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చిత్రలేఖనం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు వంటి వాటిపై అవగాహన కల్పించడమే శిబిరం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులతో పాటు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేష్‌బాబు, తిరుతపయ్య, చంద్రశేఖర్, మధుసూదన్, బుచ్చయ్య, ప్రమోద్‌కుమార్, జగత్‌రెడ్డి, రాములు, నర్సింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

లట్టుపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలి

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించి చుట్టు పక్కల గ్రామాలను అనుసంధానం చేయాలని లట్టుపల్లి మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. లట్టుపల్లి గ్రామానికి చుట్టు పక్కల గిరిజన తండాలు ఎక్కువగా ఉన్నాయని, వాటితో పాటు ఆయా గ్రామాలను అనుసంధానం చేసి మండలంగా ప్రకటించాలన్నారు. ఎమ్మెల్యే డా.రాజేష్‌రెడ్డి ఈ విషయమై చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో గోవింద్‌నాయక్, భూషయ్య, ప్రేమ్‌లాల్, రాజ్‌గౌడ్, తిరుపతయ్య, వంశీ, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జియాజీ, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు, గ్రామస్తులు

యువకుడి నిరాహార దీక్ష



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలని మండల కేంద్రానికి చెందిన యువకుడు మూలె మేఘరాజు ఆదివారం బస్టాండ్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. స్థానిక ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసిన ఉపయోగం లేకపోవడంతో హైదరాబాద్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అయిన సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామ యువకులతో బస్టాండ్ ఎదుట నిరహార దీక్ష చేపట్టినట్లు పేర్కొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

పెద్దకొత్తపల్లి: గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు ఈ నెల 3 నుంచి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో రైతుల సమస్యలు పరిష్కారం చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెండు కార్లు ఢీ.. పలువురికి గాయాలు

తెలకపల్లి: రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలైన ఘటన మండలంలో ఆదివారం జరిగింది. మండల పరిధిలోని గౌరారం నుంచి కల్వకుర్తికి వెళ్తున్న కారు గౌరారం– రామగిరి మధ్యలో రోడ్డు సైడుకు ఆపుకున్నారు.ఈ క్రమంలో కారులో కల్వకుర్తి నుంచి తెలకపల్లికి వస్తున్న రాంపురం గ్రామానికి చెందిన సుధీర్‌గౌడ్ ఆగి ఉన్న కారును వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో కారులో ఉన్న గౌరారానికి చెందిన అనిల్, పవన్‌కుమార్, నాగయ్య, స్వరూప గాయాలయ్యాయి. అదే విధంగా సుధీర్‌గౌడ్, పుష్ప, ఓ బాలిక తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని 108లో చికిత్స నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదంలో రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి.

నిత్యావసర సరుకుల పంపిణీ

కల్వకుర్తి రూరల్: బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలోని పేద ముస్లింలకు ఎంఐఎం నా యకుడు అబ్దుల్‌సత్తార్ ఆధ్వర్యంలో ఆదివా రం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రూ పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు.